మనం ఎలాంటి దేశాన్ని నిర్మిద్దాం అనుకున్నాం?
మన పాలకులు ఎలాంటి దేశాన్ని నిర్మిస్తున్నారు?

# మానవ హక్కుల వేదిక, నిజామాబాద్ జిల్లా 5వ మహాసభ

**ఆదివారం, 2019 నవంబరు 10, పొద్దున్న 10 గంటలకు**
**గౌతమి డిగ్రీ కాలేజీ, ఖలీల్ వాడి, నిజామాబాదు.**

**మిత్రులారా!**

ఈ దేశవాసులు 1949 నవంబర్ 26న ఒక కల కన్నారు. ఆ రోజునే భారత రాజ్యాంగాన్ని రాజ్యాంగ పరిషత్తు ఆమోదించింది. భారతదేశం ఒక సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామిక గణతంత్ర దేశంగా రూపు దిద్దుకో బోతున్నది అని రాజ్యాంగం చెప్పింది.

అలాంటి దేశంలో మామూలు మనుషులకు కూడా సామాజిక, ఆర్థిక, రాజకీయ **న్యాయం** లభిస్తుందని అన్నారు. ఆలోచించడానికీ, ఆ ఆలోచనను వ్యక్తీకరించడానికీ, నమ్మడానికీ, విశ్వసించడానికీ, ఆరాధించడానికీ **స్వేచ్ఛ** ఉంటుంది అన్నారు. హోదాలలో అవకాశాల్లో **సమానత్వమే** ప్రాతిపదిక అన్నారు. వ్యక్తి గౌరవానికీ, జాతి ఐక్యతకు, సమగ్రతకూ హామీ ఇస్తున్నందువల్ల దేశ వాసుల మధ్య **సోదరభావం** నెలకొంటుంది అని తెలిపారు.

అలాంటి సుందర భారతంలో ప్రజలందరూ హక్కులను అనుభవిస్తారని అన్నారు. కొన్ని మౌలిక హక్కులను రాజ్యాంగం గుర్తించింది. పాలనా బాధ్యతలు స్వీకరించే పాలకులు ప్రజల హక్కులను గౌరవిస్తూ రాజ్యాంగ లక్ష్యాన్ని సాధించాలని రాజ్యాంగం అంటోంది.

రాజ్యాంగం గుర్తించిన హక్కుల అన్నిటిలోకీ జీవించే హక్కు, వ్యక్తి స్వేచ్ఛ హక్కు తలమానికమైనవి. చట్టం నిర్దేశించిన పద్ధతుల్లో తప్ప ఏ వ్యక్తి జీవితాన్ని గాని, వ్యక్తి స్వేచ్ఛను గాని హరించరాదు అని రాజ్యాంగం ప్రకటించింది దీన్ని ఓ కర్తవ్యంగా గౌరవించాలని, ప్రజల జీవితాలలో ఈ హక్కును అంతర్భాగం చేయాలని పాలకులపై బాధ్యత మోపింది రాజ్యాంగం. బూటకపు ఎన్కౌంటర్లు అయినా నిజమైన ఎన్కౌంటర్లు అయినా ఆత్మరక్షణ కోసమే చేశామని

న్యాయస్థానంలో రుజువు చేసుకోవాల్సిన బాధ్యత చంపిన వాళ్లపైనే ఉంటుంది అని అంటోంది చట్టం. చట్టబద్ధ పాలనకు కట్టుబడి ఉన్నామన్న పోలీసులు చంపిన వారిపై కేసు నమోదు చేయరు!! అలాంటి పోలీసులను పాలకులు ఏమీ అనరు!! ఇక కోర్టులు పాము చావొద్దు కర్ర విరగొద్దుఅనే రీతిలో తీర్పులు ఇస్తుంటాయి!

స్వేచ్ఛ అనే పదమే పాలకులకు పరమ అసహ్యకరంగా కనిపిస్తోంది. ఆలోచించే స్వేచ్ఛ, భావప్రకటన స్వేచ్ఛ అంటే పాలకులకు కంపరం. ప్రభుత్వాల పాలనా విధానాల మీద అసమ్మతి ప్రకటించిన వారినందరి పైనా అత్యంత దుర్మార్గమైన చట్టాలను ప్రయోగిస్తున్నారు. గొడ్డుమాంసం తిన్నారనే నెపంతో ముస్లింములనూ, కులాంతర వివాహం చేసుకున్నారనే నెపంతో, గుడిలోకి ప్రవేశించారనే నెపంతో, ఊరుమ్మడి చెరువులోకి నీళ్ల కోసం దిగారనే నెపంతో దళితులను మతోన్మాద మూకలు వీధుల్లో బహిరంగంగా మోది మోది చంపుతుంటే ఇదేమి పాలనయ్యా మోదీ గారూ అని అంటూ లబ్దప్రతిష్టులైన 49 మంది మేధావులు మన ప్రధానమంత్రి కి బహిరంగ లేఖ రాస్తే బీహార్ రాష్ట్రంలోని ముజఫర్ పుర్ సదర్ పోలీస్ స్టేషన్ లో దేశద్రోహం కేసు నమోదు చేస్తారా? తప్పుడు వార్తలు రాస్తున్నారు అనే నెపంతో పాత్రికేయులపై కేసులు పెట్టాల్సిందిగా ప్రభుత్వ శాఖల అధిపతులను ఆదేశిస్తూ ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి ఓ జీవో జారీ చేశారు. నియంతలకు, అవినీతిపరులకు కలాలు అంటే ఎప్పుడూ భయమేలే. ఆ జీవోను సీనియర్ జర్నలిస్టులు అయిన దేవులపల్లి అమర్, రామచంద్రమూర్తి లు సమర్ధించడం ఎంత విషాదం!! ఎంత విషాదం!!

రాజ్యాంగానికి కట్టుబడి ఉంటూ రాజ్యాంగ ఆదేశాలనూ, రాజ్యాంగ విలువలనూ రాజ్యాంగ సంస్థలనూ గౌరవించమని అంటే రాజ్యాంగ రూపకల్పన లో ఒక్క క్షణం కూడా ఖర్చు చేయని వారు మనకు పాలకులుగా దాపు రించడం ఎంత విషాదం!! ఎంత విషాదం!!

ప్రజాప్రాతినిధ్య పరిపాలనను అందించిన రాజ్యాంగం, ప్రజలకు హక్కులను కల్పించిన రాజ్యాంగం, పాలనకు మార్గ దర్శక సూత్రాలను నిర్దేశించిన రాజ్యాంగం వద్దే వద్దు , మాకు మనుధర్మ శాస్త్ర మే ముద్దు, అదే భావి భారత పాలనకు మార్గదర్శి అని రోడ్డెక్కి అరిచిన వాళ్ళు మనకు పాలకులుగా దాపురించడం ఎంత విషాదం!! ఎంత విషాదం!!

మతపరమైన, భాషాపరమైన, ప్రాంతపరమైన దురభిమానాలను అధిగమించి ప్రజలందరి మధ్య సహోదర భావాన్ని పెంపొందించమని రాజ్యాంగం అంటుంటే ద్వేషాన్ని ఆసరా చేసుకుని, రాము రెచ్చగొట్టిన విద్వేష విషజ్వాలల్లో కాలిపోయిన మనుషుల శవాలను అధికార సోపానాలుగా మలుచుకున్న వారు మనకు పాలకులుగా దాపురించడం ఎంత విషాదం!! ఎంత విషాదం!!

ప్రకృతిని, పర్యావరణాన్ని పరిరక్షించి దాన్ని మెరుగుపరచాలని రాజ్యాంగం అంటుంటే అడవులను స్మగ్లర్లకు అప్పజెప్పి, అక్కడక్కడా మొక్కలు నాటే హరితహార ప్రచారకులు, ఓపెన్ కాస్ట్ గనుల పేరుతో సుక్షేత్రాలను బొందల గడ్డలుగా మారుస్తున్న వారు, జలవనరులను పెంచి ఆయకట్టును స్థిరీకరిస్తామనే పేరిట కనీవినీ ఎరుగనంతటి స్థాయిలో అడవుల విధ్వంసానికి, అడవిబిడ్డల విస్థాపనకు, జీవవైవిధ్య నిర్మూలనకు యథేచ్ఛగా పాల్పడుతున్న వారు మనకు పాలకులుగా దాపురించడం ఎంత విషాదం!! ఎంత విషాదం!!

కొద్దిమంది చేతుల్లో సంపద, ఉత్పత్తి సాధనాల కేంద్రీకరణ జరగకుండా ఆర్థిక వ్యవస్థను నిర్వహించాలి అని రాజ్యాంగం ఒక కర్తవ్యాన్ని పాలకులపై పెట్టింది. మరి మన పాలకుల నిర్వాకంఎలా ఉందో చూద్దామా?

జాతీయ సంపద లో 77%, జనాభాలో 10 శాతంగా ఉన్న వారి వద్ద కేంద్రీకృతమై ఉంది. 2017 లో దేశంలో ఉత్పత్తి అయిన సంపదలో 73 శాతం ఒక శాతంగా , అవును 1 శాతంగా ఉన్న పెద్ద పెట్టుబడిదారుల చేతుల్లోకి పోయింది. 2019 మొదటి ఆరు నెలల కాలంలో అత్యధిక సంపన్నులు తమ ఆస్తులకు లక్ష కోట్ల రూపాయల విలువైన సంపదను జోడించారు. ఇండియాలో 119 మంది బిలియనీర్లు!! అంటే ఒక్కొక్కరి వద్ద వంద కోట్ల కోట్ల రూపాయల విలువ గల సంపద కేంద్రీకృతమై ఉంది. దశాబ్ద కాలంలో ఈ బిలియనీర్ల సంపద 10 రెట్లు పెరిగింది. ఆక్స్ఫామ్ ఒక అంచనా వేసింది. అదేమిటంటే.... ఇవాళ మన గ్రామీణ ప్రాంతాలలో కనీస వేతనానికి పనిచేస్తున్న కూలీ ఇవాళ ఒక వస్త్ర వ్యాపార కంపెనీలో ఉన్నతోద్యోగి సంపాదించే వేతనంతో సరిసమానమైన వేతనం సంపాదించాలంటే ఆ గ్రామీణ కూలీకి 941 సంవత్సరాల కాలం పడుతుంది. అప్పటికి ఆ ఉన్నతోద్యోగి వేతనం ఎన్ని రెట్లు పెరిగి పోతుందో!?

ఈ సంపద కూడా ఎవరి వద్ద కేంద్రీకృతం అవుతుందో తెలుసా? బ్రాహ్మణ ధనికులలో 50%, క్షత్రియ ధనికులలో 31%, వైశ్య ధనికులలో 44%, కాయస్థ ధనికులలో 57% దేశంలోని అత్యధిక ధనిక వర్గం జాబితాలోకి వస్తారు. సంపదను ఇలాగే పెరగనీయడం ప్రాచీన రాజధర్మం ప్రకారం ధర్మమే. కాని ఆధునిక రాజ్యాంగ ధర్మం ప్రకారం అధర్మం. రాజ్యాంగ ధర్మం ప్రకారం ఈ సంపద పునఃపంపిణీ కావాలనే వాళ్ళు పాలకుల కంటికి దేశద్రోహులుగా కనపడతారు!! పాలకులు ప్రాచీన రాజ ధర్మాన్ని అనుసరిస్తున్నారు. రాజ్యాంగాన్ని అమలు చేస్తామని ప్రమాణం చేసిన పాలకులు రాజ్యాంగ ధర్మాన్ని విస్మరిస్తున్నారు. ఇదెంత విషాదం!! ఇదెంత విషాదం!!

ఈ విషాద భారతం లో అడుగడుగునా హక్కుల హననమే. ఒకవైపు రాజ్యము, మరోవైపు పౌర సమాజం లోని ఆధిపత్య వ్యవస్థలు ఈ హక్కుల హననానికి పాల్పడుతున్నాయి. ఈ క్రమాన్ని ప్రశ్నించే గొంతులు ఇవ్వాళ సమాజానికి అవసరం. మానవ హక్కుల వేదిక అలాంటి గొంతుల్లో ఒక గొంతు. ఆ గొంతు ఎంత బలంగా వినపడితే హక్కులను అణిచి వేస్తున్న వారికి అంతగా ప్రతిఘటన ఉన్నట్టు. ఈ గొంతు ని మరింత బలంగా వినిపించే కృషిలో భాగమే మానవ హక్కుల వేదిక నిజామాబాద్ జిల్లా అయిదవ మహాసభ.

ఈ మహాసభలో...

మానవ హక్కుల వేదిక ఉభారాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యులు,

**విఎస్. కృష్ణ ,**

**నేడు భారత రాజ్యాంగం లోని సమాఖ్య స్ఫూర్తి కి జరుగుతున్న విఘాతం** పైన,

రాష్ట్ర అధ్యక్షులు

**గొర్రెపాటి మాధవ రావు ,**

**దేశంలో పెరుగుతున్న నియంతృత్వ ధోరణులు** పైన మాట్లాడతారు .

సంస్థ సభ్యులు, మీరు పాల్గొంటారు.

ప్రచురణ: వై. కృష్ణ గోపాల్ రావు. అధ్యక్షుడు, ఎస్. జగన్, ప్రధాన కార్యదర్శి

Please visit : humanrightsforum.org